# సంపాదకీయము

శ్రీ కృష్ణుడు జగదానందకారుడు. తన మోహన వంశితో సకల చరాచర జగత్తును సమ్మోహనంలో పడవేయగల మహాత్ముడు. తనకు వేరయినది జగత్తులోలేదనే సత్యాన్ని, తానే యంతరాత్మ యై మనందరిలో పరమాత్మగా వెలసి అనుక్షణము మనకానందము కలుగచేయు నిత్యసత్యమాయనే. అందుచేతనే ప్రతి జీవి ఆనందమునే తన సహజ గుణముగా కలిగియుంటుంది. పూజ్య బాబూజీ గారు మనందరము సంతోషముగా యుండడమే ప్రకృతి రహస్యమని యన్న దానిలోని నిజమిదే. శ్రీ కృష్ణుడు తనలోనే యందరినీ అందరిలో తననూ చూడగల మరియు చూపించగల మహాయోగి. అంటే అతనానందసాగరము. మనము అనుదినము ప్రార్థనా సమయములో మన మాస్టరుగారిని అనందసాగరముతో పోల్చి అట్టి సాగరపుటలలు మనలోయున్న సకల మాలిన్యాలను, సర్వరోగములను తొలగించుచున్నట్లుగా భావించడము జరుగుతుంది. మన గురుదేవులను ఆనందసాగరముగా భావించి ధ్యానము చేయువారి దరిదాపులకు నిరాశ నిస్పృహ రావడము జరుగదు. నైరాశ్యము వైరాగ్యము కాదు. నిర్లిప్తత కూడ వైరాగ్యము కాదు. ధ్యానము చేయునపుడు నిరాశతోనో లేక ముభావముగానో యుండుట భగవదపచారమే అవుతుంది. భగవత్సన్నిధానంలో భక్తి, శ్రద్ధతోకూడిన సంతోషమే సరియయిన భావన. ఇది కొరవడితే ఎన్ని గంటలు ధ్యానము చేసినాయది నిష్ఫలము. మన ప్రాణాహుతి సహిత ధ్యానము చేసే వారికి ఆనందానుగత సమాధి అతి సహజము. కాని ఆనందంతో యుంటూ గురుదేవుల సన్నిధానంలోయుంటూకూడా యింకా యేదో రావాలని ఉబలాట పడడము విజ్ఞత కాదు. కాని యిట్టి భావనలుయున్న వారు పెక్కురు. శ్రీ కృష్ణ సమాగమపుటానందాన్ని పరిపూర్ణంగాయనుభవించిన గోపికా శిరోమణులు ఆ శ్రీ కృష్ణ స్మరణే పరమార్థమని యెంచిన యోగద్రష్టలు. నిరంతరం మనము కోరుకొన్నప్పుడల్లా నేనున్నానటుంచు పలుకు పూజ్య బాబూజీ స్మరణలో యుండడమే మనకు శ్రీ కృష్ణోపాసకులు నేర్పిన పాఠము. అదే సదా ఆచరణీయము.

శ్రీ కృష్ణాష్టమి.
16.08.2006

(జన్మాష్టమి సంచిక : 13-3)